క్లుప్తంగా

గణనాథుడికి ప్రత్యేక పూజలు


వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

నందికొట్కూరు: పట్టణంలోని సుబ్బారావు పేటలో శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని జూపాడుబంగ్లా జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డితోపాటు పలువురు భక్తులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని లింగం వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సాయి గణేష్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

స్వామిత్వ మ్యాపింగ్ పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: స్వామిత్వ కార్యక్రమానికి ఎంపికైన గ్రామ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ సరిహద్దులు, రోడ్లు, ఇళ్ల తదితర వివరాలను డిజిటల్ మ్యాప్ రూపంలోకి మార్చే ప్రక్రియను పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శనివారం చెలిమిల్ల గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ సులోచన పాల్గొన్నారు.

బస్సులు కండిషన్‌లో లేకపోతే చర్యలు


శ్రీలక్ష్మీ చెన్నకేశవ పబ్లిక్ స్కూల్ బస్సును పరిశీలిస్తున్న ఆర్టీఓ ఏవీ సత్యనారాయణరెడ్డి

నందికొట్కూరు: ప్రైవేట్ స్కూల్ బస్సులు కండీషన్స్‌లో లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఆర్టీఓ ఏవీ సత్యనారాయణరెడ్డి హెచ్చరించారు. మిడుతూరు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ పబ్లిక్ స్కూల్ బస్సులు కండీషన్స్ లేవని, అటెండర్ కూడా లేరని వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం వాటిని తనిఖీ చేశారు. నాలుగు బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, చిన్న సమస్యలున్నాయని, వాటిని వారంలోపు సరిచేసుకోవాలని సూచించారు. ప్రతి బస్సుకు అటెండర్‌ను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

పాములపాడు: ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. శనివారం తహసీల్దార్ సుభద్రమ్మ, మండల వ్యవసాయ అధికారి మహేశ్వరరెడ్డి మద్దూరు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ, శ్రీలక్ష్మివెంకట సాయి ట్రేడర్స్, ఉమ్మర్ ఆగ్రో ఏజెన్సీస్, మహాలక్ష్మి ట్రేడర్స్, శ్రీలక్ష్మి జయ సింహాద్రి ఫర్టిలైజర్స్‌లలో తనిఖీలు నిర్వహించారు. నిల్వలు, రికార్డులు, రశీదులు పరిశీలించారు. 15 రోజుల నుంచి యూరియా నిల్వలు లేవని తేల్చారు. వారి వెంట వీఆర్వో శ్రీనువాసులు ఉన్నారు.

కొత్త రామాపురంలో వైద్యశిబిరం ఏర్పాటు


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: చికున్‌గున్యా కేసులు నమోదుకావడంతో మండలంలోని కొత్తరామాపురం గ్రామంలో శనివారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేసి జ్వరపీడితుల వివరాలను సేకరించారు. అనుమానితుల రక్త నమూనాలు సేకరించినట్లు సీహెచ్‌ఓ కుదూష్‌బాషా తెలిపారు. దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఫాతిమా, ఎంపీహెచ్‌ఏ భాస్కర్, కిరణ్మయి, చెన్నమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం..తస్మాత్ జాగ్రత్త!

- గ్రామాల్లో మురుగునీరు నిల్వ వల్ల దోమల వృద్ధి
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- ఆందోళనలో ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. సరైన మురుగు కాలువలు లేక రోడ్లపైనే వర్షపు నీరు నిలిచిపోతోంది. గుంతలు పడిన వీధి రోడ్లలో నిల్వ ఉన్న వర్షపు నీటితో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. అందుకే వైద్యులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో కచ్చితంగా దోమ తెరలు వాడి విష జ్వరాల బారి నుంచి రక్షించుకోవాలని హితవు పలుకుతున్నారు.


మారుతీ నగర్‌లో అధ్వానంగా మారిన మట్టి రోడ్డు

నందికొట్కూరు: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వీధుల్లో పలువురు రోడ్లను ఆక్రమించడం, డ్రైనేజీలు లేకపోవడంతో వీధులు మురికి కుంటలుగా మారుతున్నాయి. ఉన్న కొద్దిపాటి డ్రైనేజీలు కూడా అధ్వానంగా మారి దోమలకు నిలయంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ, మలేరియా, జ్వరం బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సీజనల్‌గా ప్రబలే వ్యాధులు

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో పాటు మలేరియా, డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు-450, బ్రాహ్మణకొట్కూరు-50, పాములపాడు-50, మిడుతూరు-70, తలముడిపి-50, కడుమూరు-100, పగిడ్యాల-40, ప్రాతకోట-40, జూపాడుబంగ్లా-60, పారుమంచాల-45, కొత్తపల్లి-50, గోకవరం-40, ఎర్రమఠం-40 చొప్పున్న రోగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తునట్లు వైద్యులు తెలిపారు.

మలేరియా

మలేరియా వ్యాధి ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల వస్తుంది. నిల్వ ఉన్న మురుగు నీటిలో పెరిగిన దోమలు మలేరియా వ్యాప్తికి కారణమవుతున్నాయి. మలేరియా వ్యాధి వస్తే చలి, వణుకు, ఒళ్లు నొప్పులు, జ్వరం రోజు విడిచి రోజు రావడం తదితర లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధి సోకిన వారు వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స పొందాలి.


మిడుతూరులోని బస్టాండ్‌లోనే సిమెంట్ రోడ్డుపై నిల్వ ఉన్న మురికి నీరు


కొత్తపల్లి మండల కేంద్రంలో బురదమయంగా మారిన రోడ్డు

డెంగీ

ఆడ ఈడీస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వ్యాధి వస్తుంది. పగటిపూట ఎక్కువగా ఈ దోమలు సంచరించి కుడతాయి. అకస్మాత్తుగా జ్వరంతో పాటు ఒళ్లు నొప్పులు వస్తాయి. కీళ్లు, కండరాల నొప్పులు, వాంతులతో డెంగీ మొదలవుతుంది. కొంత మందికి శరీరంపై దద్దుర్లు ఏర్పడతాయి.

డయేరియా

కలుషిత ఆహారం, నీరు తాగడం వల్ల డయేరియా వస్తుంది. రోజుకు మూడు సార్లు అంతకంటే ఎక్కువ సార్లు నీళ్ల విరేచనాలు అయితే డయేరియాగా భావించవచ్చు. వాంతులు, విరేచనాలు, అతి దాహం, కడుపు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. మురుగు కుంటల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయాలి.
– ఏసన్న దామగట్ల గ్రామం, నందికొట్కూరు మండలం

డ్రైనేజీలు నిర్మించాలి



గ్రామాల్లో వర్షపు నీరు, మురుగు నీరు వెళ్లేందుకు డ్రైనేజీలు నిర్మించాలి. డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తీసేయాలి. డ్రైనేజీల్లో దోమల వృద్ధి చెందకుండా ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది క్రమం తప్పకుండా దోమల నివారణ మందు పిచికారీ చేయించాలి. మారుమూల గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి సలహా లు, సూచనలు ఇవ్వాలి.
– నక్క మల్లయ్య, జూపాడుబంగ్లా మండలం

ప్రజలకు అవగాహన కల్పిస్తాం



వర్షకాలం వస్తే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలకు అవగాహన కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో అవగాహన కల్పిస్తున్నాం. పట్టణ, గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి. పట్టణ, మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. దోమలు వృద్ధి చెందకుండా మురుగు కుంటల్లో పిచికారీ చేయిస్తున్నాం. ఇంటిలో తాగిన పచ్చి టెంకాయలు, సైకిల్, బైక్ టైర్లలో నీరు లేకుండా చూసుకోవాలి. ప్రజలు ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి. ప్రతి రోజు ఓపీ 450పైగానే రోగులకు చికిత్సలు అందిస్తున్నాం.
– డాక్టర్ రాంబాబు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటిండెంట్

మహానందిలో భక్తుల సందడి


భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

మహానంది: వీకెండ్ సందర్భంగా శనివారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు మహానంది ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు ఉచిత, ఆర్జిత సేవ టికెట్ల ద్వారా కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహానందిలో వర్షం

మహానంది మండలంలో శనివారం రాత్రి వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా మహానంది పుణ్యక్షేత్రం పరిసరాల్లో భక్తులు అవస్థలు పడ్డారు. అన్ని గ్రామాల్లోనూ సుమారు రెండు గంటల పాటు వర్షం కురవడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు దోమలకు అల్లాడిపోయారు.

నందికొట్కూరును కర్నూలులో కలపాలి

నందికొట్కూర్: కర్నూలు జిల్లాలో నందికొట్కూరు నియోజకవర్గాన్ని కలపాలని డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ జిల్లా కార్యదర్శి వేటూరి.రంగస్వామి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 కి.మీ దూరంలో ఉన్న కర్నూలు జిల్లాలో కాకుండా 60 కి.మీ దూరంలో ఉన్న నంద్యాల జిల్లాలో నందికొట్కూరు నియోజకవర్గాన్ని కలపడం వల్ల రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలకులు, అధికారులు ఆలోచించి నందికొట్కూరును కర్నూలు జిల్లాలో కలపాలని కోరారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మున్సిపల్ సిబ్బంది సహకారంతో మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పలు కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు ఏర్పాటు చేయాల్సి ఉందని, ఇప్పటికే రింగు రోడ్డు పనులను రూ.4.20 కోట్లతో ప్రారంభించామన్నారు. త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ. 72,97,913 మంజూరయ్యాయని, వాటి ద్వారా పలు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మున్సిపాలిటీ అవుట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన శ్రీనివాసులు భార్య శ్రీదేవిని విధుల్లోకి తీసుకునేందుకు సభ్యుల ఆమోదాన్ని కోరుతున్నట్లు చెప్పారు. అనంతరం మూడు తీర్మానాలకు సభ్యులు ఆమోదం తెలిపి, ఒకదాన్ని తిరస్కరించారు. సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్, కమిషనర్ రమేష్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు అవగాహన


మాట్లాడుతున్న శ్రీధర్‌రావు

పగిడ్యాల: స్వయం సహాయక పొదుపు మహిళలకు 'మన డబ్బులు మన లెక్కలు' కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సెర్ప్ ఐబీ పీఎం శ్రీధర్‌రావు, జిల్లా డీపీఎం ఐబీ ఫైనాన్స్ నాయక్, జిల్లా ఏపీఎం ఐబీ పుణ్యవతి హాజరయ్యారు. శ్రీధర్‌రావు మాట్లాడుతూ పొదుపు సంఘాల్లో నెలనెలా జరిపే లావాదేవీలను ఆన్‌లైన్ ద్వారా చెక్ చేసుకోవడానికి యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రకళ ల్గొన్నారు.



● డబుల్ లైన్ ఎప్పుడో?

హామీ ఇచ్చి ఏడాదిన్నర కాలమైనా నందికొట్కూరు ఎమ్మెల్యే దాన్ని నెరవేర్చకపోవడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నందికొట్కూరు నుంచి పగిడ్యాల వరకు డబుల్ లైన్ బీటీ రోడ్డు మంజూరు చేయిస్తానని గిత్త జయసూర్య హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక నిధులు మంజూరు చేయించకపోవడంతో సంకిరేణిపల్లె, బీరవోలు, అంజనేయనగర్, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుంటంతో రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన మోకాటిలోతు గుంతల్లో నీరు నిల్వ ఉంటోంది. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎదురెదురుగా వచ్చిన వాహనాలు రోడ్డు దిగితే ప్రమాదానికి గురికావాల్సిందే. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేయించి డబుల్ రోడ్డు వేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
– పగిడ్యాల



నీటి వృథా!

కొత్తపల్లి మండలంలోని జి.వీరాపురం గ్రామ ఎంపీపీ పాఠశాల వద్ద ఉన్న ట్యాంక్ నుంచి నీరు వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. నెలల తరబడి నీరు వృథా అవుతుండటంతో పాఠశాల వద్ద పాచి పట్టి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. నీటి ట్యాంకు, పైపులు కూడా పాచి పట్టి దుర్గంధం వెదజల్లుతోంది. అవే నీటితోనే విద్యార్థులు దాహం తీర్చుకుంటున్నా పంచాయతీ అధికారులు గానీ, విద్యాశాఖ అధికారులు గానీ పట్టడం లేదు. పాచిలో అడుగు తీసి అడుగు వేసే క్రమంలో కొందరు విద్యార్థులు జారి పడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఉన్నతాధికారులైనా స్పందించి నీటి వృథాను అరికట్టి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
– కొత్తపల్లి

ఎట్టకేలకు గణనాథుడి శోభాయాత్ర

- వైఎస్సార్‌సీపీ నేత బుడ్డా శేషారెడ్డి చొరవతో ఆందోళన విరమించిన వీహెచ్‌పీ నేతలు
- డీఐజీ, ఎస్పీ జోక్యంతో ప్రశాంతంగా వినాయక నిమజ్జనం


నిమజ్జనం కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న బుడ్డా శేషారెడ్డి


వెలుగోడులో సాగుతున్న వినాయకుడి శోభాయాత్ర

వెలుగోడు: వినాయకుడి నిమజ్జనం సందర్భంగా వెలుగోడులో రెండు రోజులుగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితి సాధారణ స్థితికి వచ్చింది. ఉదయం నుంచి ఆందోళన చేపట్టిన విశ్వ హిందూ పరిషత్ నేతలు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి చొరవతో శాంతించారు. డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అదిరాజ్‌సింగ్ జోక్యంతో ఎట్టకేలకు గణనాథుడి శోభాయాత్ర ప్రశాంతంగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వినాయక నిమజ్జనం ముగియడంతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ జేసీ విష్ణు చరణ్, ఉన్నతాధికారులు ఇరువర్గాలతో చర్చలు జరిపినా వినలేదు. ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న ట్రాక్టర్లను రోడ్డుపై నిలిపి కమిటీ సభ్యులు ట్రాక్టర్ ఇంజిన్‌ను తీసుకెళ్లారు. దీంతో జిల్లా కలెక్టర్ రాజకుమారి వెలుగోడుకు చేరుకుని పోలీసులతో విగ్రహాలకు బోయ రేవుల గ్రామంలోని గాలేరు వద్ద అర్ధరాత్రి తరువాత నిమజ్జనం చేయించారు. వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, అధికారుల తీరును నిరసిస్తూ శనివారం ఉదయం పట్టణంలోని పోస్టాఫీస్ నుంచి పోలీసు స్టేషన్ వరకు వీహెచ్‌పీ కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ప్రదర్శన చేపట్టి ఆత్మకూరు-నంద్యాల ప్రధాన రహదారిపై బైఠాయించి సాయంత్రం వరకు ఆందోళన నిర్వహించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, సర్పంచ్ జయపాల్, పోలీసులకు వ్యతిరేకంగా ఆందోళనకారులు నినాదాలు చేశారు. దీంతో ఆత్మకూరు-నంద్యాల ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

రంగంలోకి బుడ్డా శేషారెడ్డి

వీహెచ్‌పీ శ్రేణుల ఆందోళన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి రంగంలోకి దిగారు. వీహెచ్‌పీ నేతలతో చర్చించి యథావిధిగా ఉత్సవమూర్తులను ఊరేగిస్తూ నిమజ్జనం చేయిస్తానని మాటిచ్చారు. పోలీసు స్టేషన్ వద్దకే గణేష్ విగ్రహాన్ని తెప్పించి అక్కడి నుంచి ఎస్సీ కాలనీ మీదుగా డప్పు వాయిద్యాల మధ్య శోభయాత్రను నిర్వహించారు. డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్, డీఎస్పీ రామాంజినాయక్, సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ సురేష్ బందోబస్తు మధ్య నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించారు. దీంతో ఉత్సవ కమిటీ సభ్యులు, వీహెచ్‌పీ నేతలు బుడ్డా శేషారెడ్డి, పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపకారాగారాన్ని తనిఖీ చేసిన జడ్జి


సబ్‌జైల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జడ్జి

నందికొట్కూరు: పట్టణంలోని ఉపకారాగారాన్ని జడ్జి శోభారాణి శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కారాగారంలోని వసతులపై ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. 70 ఏళ్లు పైబడిన వృద్ధుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఉచిత న్యాయ సహాయం కోసం జైలులోని ఉచిత న్యాయసేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం


నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

జూపాడుబంగ్లా: నాలుగు రోజుల పాటు పూజలందుకున్న బొజ్జ గణపయ్య ప్రతిమలను శనివారం కేసీ కాల్వలో నిమజ్జనం చేశారు. తాటిపాడు, జూపాడుబంగ్లా తదితర గ్రామాల్లో గణేష్ ప్రతిమలను ఆనందోత్సవాల మధ్య ఆయా గ్రామాల్లోని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కేసీ కాల్వలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

పగిడ్యాల: పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం విమర్శించారు. శనివారం వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేశాయన్నారు. స్కీం వర్కర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కిర్‌సాహెబ్, సీఐటీయూ మండల అధ్యక్షులు బాబు, ఉపాధ్యక్షులు సాజిదాబేగం, కార్యదర్శి ఖుర్షీద్‌బీ, సహాయ కార్యదర్శి సావిత్రి పాల్గొన్నారు.

నివాళి

ఆత్మకూరు: మండలంలోని ఇందిరేశ్వరం గ్రామ పరిధిలోని చెంచుగూడేనికి చెందిన సీపీఎం సభ్యులు నాగుల నాగరాజు శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నరసింహానాయక్, మడల కార్యదర్శి సుధాకర్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ తదితరులు గ్రామానికి చేరుకుని నాగరాజు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద, శ్రీపతిరావుపేట గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ ఉమ్మర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కురుకుంద-1 సచివాలయ పంచాయతీ కార్యదర్శి జగజ్జీవన్, శ్రీపతిరావుపేట సచివాలయ పంచాయతీ కార్యదర్శి శివలింగస్వామి ఈనెల 28, 29 తేదీల్లో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరయ్యారన్నారు. వివరణ కోరినా సమాధానం లేకపోవడంతో రెండు రోజులపాటు వేతనాలు కట్ చేయడంతోపాటు క్రమశిక్షణ ఉల్లంఘించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. అలాగే ఈ రెండు పంచాయతీల పరిధిలో కలెక్టర్ ఆదేశించిన సర్వేలు కూడా పూర్తి చేయలేదని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వీరికి నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీశైలం, నందికొట్కూరు
70750 09158
Office mail : sakshiknladvt@gmail.com